

12న జాబ్‌మేళా

ప్రజాశక్తి- అరకులోయ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో అరకువేలీ ఆర్‌ఐటిఐలో ఈనెల 12న గురువారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థఅధికారి డాక్టర్ పి రోహిణి తెలిపారు. మినీ జాబ్‌మేళాలో రుద్ర కోపరటివ్ సర్వీసెస్, మోహన్ స్పీఇంటెక్, పేటీయం, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు నాలుగు కంపనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలోని 18-30 ఏళ్ల వయస్సు కలిగి, టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపై విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత పాన్, ఆధార్ కార్డు, సరిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10వేలు నుంచి రూ. 15 వేలు జీతం చెల్లిస్తారని, జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.naipunyam.ap.gov.in వెబ్‌సైట్ లేదా 94910 57527, 9398338105 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మద్యం దుకాణాలను తొలగించాలి

ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన మహిళల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ప్రజాశక్తి - పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ ఎదురుగా, కాంప్లెక్స్ పక్కన ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలని ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు డిమాండ్ చేశారు సోమవారం ఐటిడిఎ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకులు కుమారి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు చిన్నారావు కార్తీక్ మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఎ ఎదుట, కాంప్లెక్స్ దరి మద్యం దుకాణాల వల్ల కార్యాలయానికి వివిధ పనులపై వచ్చేవారు, ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఆయా దుకాణాలను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. మత్తు వలన కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం దుకాణాల ఏర్పాటుతో మహిళలకు రక్షణ లేకుండా చేశారని మండిపడ్డారు. మద్యం ధరలను తగ్గించామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం, మద్యం మత్తులో జీవితాలను నాశనం చేసుకుంటున్న వ్యక్తుల, కుటుంబాల దుస్థితిని పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు తమ సంపాదనలో సగం మద్యానికి, మిగతా మొత్తాన్ని మద్యం వల్ల పాడైన అనారోగ్య సమస్యలకు వైద్యానికి ఖర్చుచేస్తే, ఇక కుటుంబపోషణ సాఫీగా ఎలా సాగుతుందని ప్రశ్నించారు. జనవాసాల మధ్యనున్న మద్యం దుకాణాలను పూర్తిగా తొలగించాలని, వాటిని జనసంచారం లేని ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. మద్యం తాగి చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలన్నారు. ఐటిడిఎ ఎదుట, ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దనున్న మద్యం దుకాణాల వల్ల ప్రజలు ముఖ్యంగా మహిళలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్, ఐటిడిఎ పిఒ పట్టించుకోకపోవడం శోచనీయమని, తక్షణమే ఆయా దుకాణాలను తొలగించాలని డిమాండ చేశారు.

ఏడు రోడ్ల నిర్మాణాలకు డిఎల్‌సి ఆమోదం


వెంటనే పనులు చేపట్టండి : కలెక్టర్ దినేష్ కుమార్



డిఎల్‌సి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా స్థాయి కమిటీలో ఆమోదించిన రోడ్ల పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. సోమవారం అటవీ శాఖ, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ, పి ఐ యు, రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫారెస్టు అధికారులు, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి రహదారులు నిర్మాణానికి ఫారం'ఎ'లో అటవీశాఖ అనుమతులకు పంపించాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు జాప్యం చేయకుండా ఫారం 'బి'లో అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించేటప్పుడు ముందుగా గ్రామసభ తీర్మానం చేయాలన్నారు. గ్రామసభ తీర్మానంలో ఇక మీదట భవిష్యత్తులో పోడు చేయమని గ్రామస్తుల ఆమోదం తీసుకోవాలన్నారు. అరకువ్యాలీ మండలం మాడగడ నుండి అరుకు రోడ్డు, డుంబ్రిగుడ మండలం గుల్లి నుండి డబ్బగరువు రోడ్డుకు అటవీ శాఖ అధికారులు ,రెవెన్యూ అధికారులు, ఇంజనీరింగ్ అధికాలు సంయుక్తంగా సర్వే చేయాలన్నారు. జోలగుడ నుండి డుంబ్రిగుడ రోడ్డు ఆమోదించామన్నారు. లోతేరు నుండి చెల్లుబడి, కటికి వాటర్ పాల్స్, తారాబు వాటర్పాల్స్, కర్రిగుడ, చినకోవెల రోడ్లుకు ఆమోదించామన్నారు. సెల్ టవర్ల నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాకటర్ ఎంజె. అభిషేక్ గౌడ, ఐటిడిఎ పిఒ వి అభిషేక్, సబ్ కలెక్టర్ సౌరమన్ పటేల్, డిఆర్ఒ. కె. పద్మలత, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు కె. వేణుగోపాల్, జి. డేవిడ్‌రాజు, సబ్ డిఎఫ్ఒ ఉమా మహేశ్వరి, పర్చువల్‌గా రంపచోడవరం నుంచి పిఒ కె. సింహాచలం, చింతూరు పిఒ అపూర్వ భరత్, పంచాయతీ రాజ్ ఇఇ కొండయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి




బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి బాలయ్య

ప్రజాశక్తి- చింతపల్లి :మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు జెడ్‌పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. సోమవారం గొందిపాకలు గ్రామంలో నూకాలమ్మ ఆలయం వద్ద జెడ్‌పిటిసి నిధులతో మంచినీటి బోరు పనులకు స్థానిక సర్పంచ్ సాగిన వరలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయానికి విచ్చేసే భక్తులకు తాగునీరు అందించాలనే సదుద్దేశంతో తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జెడ్‌పిటిసి కోటా నిధులతో మండలంలో మంచినీటి ఎద్దడి నివారణకు బోర్లు మజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలో మంచి నీటి సమస్య లేకుండా అవసరమైన చోట్ల బోర్లు నీటి పథకాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్, ఎంపీలను కలిసికోరుతామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి బూసరి కృష్ణారావు, శశికాంత్, తిరుణ్, మధు, సింహాచలం, అయ్యప్ప నాయుడు, రూపకాంత్, సాయి, రామకృష్ణ, లింగమూర్తి, గంగరాజు పాల్గొన్నారు.

తగ్గిన మద్యం ధరలు: ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి- పాడేరు:రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలను తగ్గించిదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ. ఆచారి సోమవారం ప్రకటనలో తెలిపారు. మాన్సన్ హౌస్ బ్రాంది (750 ఎంఎల్) పాత ధర రూ.870 కాగా, కొత్త ధర రూ.760, పింట్ (375 ఎంఎల్) పాత ధర రూ.440కాగా, కొత్త ధర రూ.380, నిబ్(180 ఎంఎల్) పాత ధర రూ.220కాగా, కొత్తధర రూ.190లకు మద్యం దుకాణాలలో విక్రయిస్తారని తెలిపారు. మద్యం దుకాణాంలో పాత స్టాక్‌ను ఇపుడున్న ఎంఆర్‌పి ధరలకే విక్రయిస్తారని, కొత్తస్టాక్ వచ్చిన తర్వాత తగ్గించిన ధరలు అమలవుతాయన్నారు.

గోపీమూర్తికే ఫస్ట్!



- ఎంఎల్‌సి ఎన్నికల్లో ఘన విజయం
- మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే గెలుపు
- 9,165 ఓట్లను సాధించిన పిడిఎఫ్ అభ్యర్థి
- ప్రత్యర్థి గంధంపై 3,906 ఓట్ల మెజారిటీ
- అన్ని రౌండ్లలోనూ కొనసాగిన ఆధిక్యం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి: ఉమ్మడి ఉభయ గోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో బొర్రా గోపిమూర్తికే గురువులు ఫస్ట్ ర్యాంకును ఇచ్చారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లలోనే ఆయనకు ఘన విజయాన్ని అందించారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు సోమవారం కాకినాడ జెఎన్‌టియు ప్రాంగణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎన్నికల పరిశీలకులు కె.హర్షవర్ధన్, రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, జెసి రాహుల్ మీనా, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికలో మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. 16,737 మంది ఓటర్లకు 15,494 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో 814 ఓట్లు చెల్లనివిగా అధికారులు ధ్రువీకరించారు. మిగిలిన 14,680 వ్యాలిడ్ ఓట్లలో విజయానికి అవసరమైన కోటా ఓట్ల సంఖ్య 7,341న గోపిమూర్తి తొలి రౌండ్‌లోనే అధిగమించి విజయాన్ని సొంత చేసుకున్నారు. రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆయనకు ధ్రువపత్రాన్ని అందించారు. సమీప ప్రత్యర్థి నారాయణరావుపై 3,906 ఓట్ల మెజారిటీని గోపిమూర్తి సాధించారు.

విజయోత్సవ ర్యాలీ

లెక్కింపు పూర్తయిన వెంటనే పలువురు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, యుటిఎఫ్ నాయకులు, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు జెఎన్‌టియుకె వద్దకు చేరుకున్నారు. పూలమాలలతో గోపిమూర్తికి ఘనంగా స్వాగతం పలికారు. జెఎన్‌టియుకె నుంచి భానుగుడి, కలెక్టరేట్ మీదుగా బైక ర్యాలీతో యుటిఎఫ్ హోమ్‌కు చేరుకున్నారు. పిడిఎఫ్ జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై గళం విప్పుతా : గోపీమూర్తి


ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన తాను ఇక నుంచి ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై శాసన మండలిలోనూ గళం విప్పుతానని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి తెలిపారు. సోమవారం కౌంటింగ్ పూర్తయిన తరువాత ఆయన జెఎన్‌టియుకె ఆవరణలో మీడియాతో మాట్లాడారు. కార్పొరేట్ అభ్యర్థులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా గురువులు నిజాయతీకే పట్టం కట్టారన్నారు. భారీ మెజారిటీని అందించి ప్రజాస్వామ్య విలువల్ని కాపాడినందుకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఇప్పటికే వివిధ ఉపాధ్యాయ సమస్యల పరిష్కార కోసం తాను అనేక పోరాటాలు చేశానని, భవిష్యత్తులో తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానన్నారు ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ టీచర్లకు సంబంధించి జిఒ 3ను సుప్రీం కోర్టు కొట్టి వేసింద న్నారు. దానికి చట్టబద్ధత కల్పిం చేలా ఎన్నికల్లో ముఖ్య మంత్రి హామీ ఇచ్చార న్నారు. దానిని అమలు చేయాలన్నారు కళాశా లల్లో పనిచేస్తున్న కాంట్రాక్ లెక్చరర్స్‌ను వెంటనే క్రమబద్ధీకరించాల న్నారు. గెస్ట్ లెక్చ రర్లు, అధ్యాపకేతర సిబ్బంది కి మినిమం టైమ్స్ స్కేల్ అమలు చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వాటిని తక్షణం విరమించుకోవాలని కోరారు. సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న విద్యా రంగానికి ప్రభుత్వం నిధులు కేటాయిం చడం లేదని విమర్శించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో గురువుల సంక్షేమానికి నిధులు కేటాయిం చట్లేదన్నారు. వారికి ప్రభుత్వ ఉపాధ్యా యుల మాదిరిగానే సెలవులు, టైం స్కేల్‌ను అందించాలన్నారు. వారికి హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు లో ప్రజల పక్షాన శాసనమండలిలో తన గొంతును వినిపిస్తానని తెలిపారు. బోధనేతర పను లను నిలిపేయాలన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించకుండా కంప్యూటర్ ఆపరేటర్‌ను ఇవ్వకుండా ఉపాధ్యాయులతో ఈ పనులు చేయించడం తగదన్నారు.



టీచర్ ఎమ్మెల్సీ గోపీమూర్తికి అభినందనల వెల్లువ

చెన్నుపాటికి ఘననివాళి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండల కేంద్రంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో చెన్నుపాటి వర్ధంతిని సోమవారం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. చెన్నుపాటి చిత్రపటానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎస్ కన్నయ్య పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మహేశ్వరరావు మాట్లాడుతూ చెన్నుపాటి ఆశయ సాధనకు యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సిపిఎస్ కన్వీనర్ జి,గెన్నుబాబు, శంకర్ పాల్గొన్నారు



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో వివిధ ఇంజనీరింగ్ విభాగాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో గిరిజన సంక్షేమ, గృహ నిర్మాణ, రోడ్లు భవనాలు, ఏపీఈపీడీసీఎల్, పంచాయతీరాజ్, స్పెషల్ మైనర్ ఇరిగేషన్ తదితర శాఖల ఇంజనీర్ విభాగాల ఇంజనీర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల గ్రామాలలో స్పెషల్ మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ విభాగం, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఏజెన్సీలో నిరుపేద గిరిజనులకు మంజూరైన గృహాలు నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. ఏయే ఇంజనీరింగ్ విభాగం ద్వారా ఎన్నెన్ని పనులు మంజూరయ్యాయి? ఎన్ని పనులు ప్రారంభించినది, ఎన్ని పనులు పూర్తి చేసినది, ఇంకా ఎన్ని పనులకు టెండర్లు పిలవలసి ఉన్నది ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఇఇ గాబ్రియేలు, డిఇలు సాయి సతీష్, చైతన్య, మల్లికార్జున రావు, దివాకర్, పి.వెంకటరమణ, నాగరాజు, ఏఈలు శ్రీనివాసరావు, వంశీ, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలి

ప్రజాశక్తి-సీలేరు

గర్భిణులు విధిగా ఆస్పత్రిలోనే ప్రసవం పొందేలా ఏర్పాట్లు చేసుకోవాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డీకే హిమబిందు అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవం పొందడం సురక్షితమని, పురిటినొప్పులు ప్రారంభమైన తరువాత ఆస్పత్రికి తరలించడం కంటే గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందుగా ఆసుపత్రిలో చేరాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రసవం పొందితే తల్లీబిడ్డకు క్షేమకరమన్నారు. ఇంటి వద్ద ప్రసవం పొందడం వల్ల తల్లీబిడ్డ అనారోగ్యానికి గురైతే ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఆసుపత్రిలో ప్రసవం పొందిన గర్భిణులకు ప్రభుత్వ నగదు ప్రోత్సాహాలను అందిస్తుందని చెప్పారు. గర్భిణులు చింతపల్లిలో ఉన్న వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణీలు పోషకాహారం తీసుకోవాలని, 9 నెలల కాలంలో కనీసం ఒకసారైనా అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. దీని వల్ల ప్రమాదకర ప్రసవాలను ముందుగానే గుర్తించే అవకాశం ఉందని ఆమె తెలిపారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న హిమబిందు

సిఆర్‌పిఎఫ్ బెటాలియన్‌ను సందర్శించిన ఆదివాసీ యువత

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : గీతం వేదికగా జరుగుతున్న 16వ జాతీయ గిరిజన యువజన సమ్మేళనంలో పాల్గొన్న ఒడిశా; ఛత్తీస్‌గఢ్‌లోని ఐదు జిల్లాలకు చెందిన ఆదివాసీ యువత సోమవారం నగరంలోని 198వ సిఆర్‌పిఎఫ్ బెటాలియన్‌ను సందర్శించారు. అక్కడి సిబ్బందితో భేటీ అయ్యారు. సిఆర్‌పిఎఫ్‌కు చెందిన వివిధ ఆయుధాలు, వాటి వినియోగం గురించి అక్కడి సిబ్బంది యువతకు వివరించారు జాతీయ గిరిజన యువజన సమ్మేళనంలో భాగంగా హెచ్‌పిసిఎల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను కూడా సందర్శించారు. వివిధ వృత్తి విద్యల్లో శిక్షణ వివరాలను ఆదివాసీ యువతకు అధికారులు వివరించారు. అనంతరం సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం సాగర్ తీరంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. యోగా శిక్షణ తరగతుల్లో ఆదివాసీ యువత పాల్గొంది. నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అధికారి గొర్లె మహేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఎన్‌వైకె అధికారి కె.వెంకట ఉజ్వల్, ఎఐ పృథ్వీ, అల్లం రాంప్రసాద్, ప్రసన్న, శ్వేత, ఎన్ఎస్ఎస్ ప్రెసిడెంట్ అవార్డుగ్రహీత ఆర్. లీలా ప్రసాద్, వాలంటరీలు జేమ్స్, జ్ఞానదీప్ పాల్గొన్నారు.

నైట్ సర్వీసు బస్సులు పునరుద్ధరణ

ప్రజాశక్తి-సీలేరు

డిసెంబర్ 2 నుంచి 8 వరకు మావోయిస్టు పార్టీ పిఎల్‌జిఎ వారోత్సవాల నేపథ్యంలో నిలిపివేసిన విశాఖ నుండి సీలేరు మీదుగా భద్రాచలం రాకపోకలు సాగించే నైట్ సర్వీసు బస్సులను సోమవారం నుండి పునరుద్ధరించారు. ఆదివారంతో వారోత్సవాలు ముగియడంతో సోమవారం నుంచి నైట్ సర్వీస్ బస్సులు తిప్పేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నైట్ సర్వీస్ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం ఆర్టీసీ అధికారులు కల్పించారు.



రైతులకు నోటీసులు అందజేస్తున్న సొసైటీ అధికారులు

పంట రుణాలు చెల్లించాలని రైతులకు నోటీసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పిఎసిఎస్‌ల ద్వారా తీసుకున్న రుణాలు తక్షణమే చెల్లించాలంటూ మండలంలో సుమారు వందమంది రైతులకు పిఎసిఎస్ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ సీఈఓ గోపాలకృష్ణ మాట్లాడుతూ 2014 ముందు మండలంలోని సుమారు 100 మంది రైతులు 42.50 లక్షలు మేర బకాయిలు ఉన్నారని తెలిపారు. వంట రుణాలు బకాయి పడ్డ రైతులు ఇళ్ల వద్దకు వెళ్లి తక్షణం బిల్లులు బకాయిలు చెల్లించాలని లేనిపక్షంలో చట్టపర చర్యలు తప్పవని హెచ్చరిస్తు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జమాల్ బాషా

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు

వైద్యాధికారులు, సిబ్బంది వీధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి జమాల్ బాషా ఆదేశించారు. జీకే వీధి మండలం సీలేరు పిహెచ్సిని సోమవారం ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. 18 సంవత్సరాల దాటిన ప్రతి ఒక్కరికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో వ్యాధిపై పిహెచ్సి పరిధి గ్రామాల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రాష్ట్రీయ బాలల ఆరోగ్య రక్ష నువ్వు భాగంగా అన్ని పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి ఆరోగ్యవంతమైన భావితరానికి బాసాటగా నిలవాలని సూచించారు. అనంతరం వార్డ్ క్లినిక్ రూములు, ల్యాబ్ పనితీరు పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి, ఆరోగ్య విస్తారణ అధికారి కే.జోజిబాబు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎన్ త్రినాధరావు, వైద్య, పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

యుటిఎఫ్ నేత లక్ష్మయ్యకు నివాళి

ప్రజాశక్తి-చింతూరు

ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) నాయకులు చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి కార్యక్రమం శనివారం స్థానిక యుటిఎఫ్ హెూమ్‌లో జరిగింది. లక్ష్మయ్య చిత్ర పటానికి యుటిఎఫ్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కొండ కృష్ణ మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు ఐటిడిఏ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను 230 మందిని గురుకుల పాఠశాలకు డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖలో ఖాళీ పోస్టులు భర్తీ కాక విద్యార్థులకు సరైన చదువు అందడం లేదని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ రాళ్ల గెడ్డ గ్రామంలో పంచాయితీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను టిడిపి కూటమి నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉమామహేష్ మాట్లాడుతూ రూ.4.80 లక్షలతో 91 మీటరు సీసీ రోడ్డు పనులు చేస్తున్నట్లు చెప్పారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తుల అనేక ఇబ్బందులు గురైయ్యేవారని, సీసీ రోడ్డు పనులు పూర్తయితే గ్రామానికి రహదారి సమస్త తొలిగిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో షోరూపు, పంచాయతీ వార్డు సభ్యులు సత్యనారాయణ, టిడిపి కూటమి నాయకులు టి.మన్మధుర, ఎం.జగ్గారావు, పి దాసుబాబు, ఎం. పొట్టయ్య, ఎం. పోతురాజు గ్రామస్తులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న టిడిపి కూటమి నాయకులు

లక్ష్మీపేట, అడుగులపుట్టు పంచాయతీల్లో...

నిధులు స్వాహాపై చర్యలు చేపట్టండి

- సర్పంచ్, కార్యదర్శులపై క్రిమినల్ కేసులు పెట్టాలి

- సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు



నిరసన తెలుపుతున్న సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు, తదితరులు

ప్రజాశక్తి- పెదబయలు :మండలంలోని లక్ష్మీపేట, అడుగులపుట్టు గ్రామపంచాయతీల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా 15వ ఆర్థిక సంఘం నిధులు స్వాహాపై అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు, స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణపై బాధ్యులైన సర్పంచ్‌లు లకే అశోక్‌కుమార్; కొర్రా వరలక్ష్మిలతోపాటు కార్యదర్శులపై క్రిమినల్ చర్యలతోపాటు రికవరీ చేయాలని, చెక్ పవర్ రద్దు చేయాలని కోరారు. రెండు పంచాయతీల్లో నిధుల స్వాహాపై ఈనెల 6న కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం లక్ష్మీపేట గ్రామంలో సిపిఎం బృందం పర్యటించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. అనంతరం సిపిఎం నేత సన్నిబాబు మాట్లాడుతూ, ఆర్థిక సంఘం నిధులుతో గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యల పరిష్కారంతోపాటు వీధిదీపాలను వేయాల్సి ఉందని, అయితే అటువంటి పనులేమీ చేపట్టకుండానే పంచాయతీ ఖాతాల నుంచి నిధులను డ్రాచేసి స్వాహా చేశారని ఆరోపించారు. మారుమూల పంచాయతీలు కావడంతో సర్పంచ్, కార్యదర్శులు కుమ్మక్కై స్వాహా చేశారన్నారు.

లక్ష్మీపేటలో 2023- 24లో రూ.6, 63,129 మొత్తం నిధులను డ్రాచేసారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1న శానిటేషన్ మెటీరియల్ పేరుతో రూ.60వేలు, క్లాప్‌మిత్ర పేరుతో సర్పంచ్ తమ్ముడు లక్కే కృష్ణారావు పేరుతో ఫిబ్రవరి 28 న రూ. 48వేలు, అదేరోజున వీధిదీపాలకు రూ.57,900, శానిటేషన్ మెటీరియల్ పేరుతో రూ.99,100, మార్చి 29న తాగునీటికి సర్పంచ్ పేరుతో రూ.1,03,616 ఇలా విత్డ్రా చేసి ఉన్నారన్నారు 2024,25 స సంవత్సరం లక్ష్మీ పేట పంచాయతీ లో మొత్తంగా రూ. 15 లక్షల 99 వేల 132 నిధులు డ్రా చేశారన్నారు. మళ్లీ లక్ష్మీపేట పంచాయతీలో జూలై 10న విద్యుత్, మెటీరియల్ కోసం రూ.90,150, అదేరోజున శానిటేషన్ మెటీరియర్ కోసం రూ.29,400 సర్పంచ్ లక్కీ అశోక్ కుమార్ పేరుతో డ్రాచేశారన్నారు. స్లీపర్, క్లాప్‌మిత్రలకు చెల్లింపులకోసం సర్పంచ్ తమ్ముడు లక్కీ రామకృష్ణ పేరుతో రూ.36 వేలు, సెప్టెంబర్ 17న సల్ది మామిడిలో తాగునీటి కోసం రూ.70,042 మండిభలో తాగునీటి బోర్లు బాగుచేసేందుకు జూన్ 29న రూ.2 లక్షలు, జూన్ 24న రూ.1,00, 400 లుంగతంగిలో తాగునీటికి జూన్ 29న రూ. 1,11,353 విత్‌డ్రా చేశారన్నారు.

ఇక అడుగులపుట్టు పంచాయతీలో, ఈ ఏడాది సెప్టెంబర్ విద్యుత్ మెటీరియల్‌కు రూ.91,730, వడ్డే కోడాపుట్టు గ్రామంలో తాగునీటికి రూ. 1,76,508, వడ్డేపుట్టులో తాగునీటికి రూ.1,76,779 పంచాయతీ నిధులను సర్పంచ్, కార్యదర్శి వ్యక్తిగత ఖాతాల్లోకి జమచేసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు.

ఎటువంటి పనులు చేపట్టకుండా పంచాయతీ నిధులను ఇష్టానుసారం డ్రాచేసి అక్రమాలకు పాల్పడిన వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన సర్పంచ్‌లు, కార్యదర్శులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని సన్నిబాబు డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయాలని, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేసి, పంచాయతీ అవసరాలకు వినియోగించాలని కోరారు.

కార్యక్రమంలో సిపిఎంమండల కమిటీ సభ్యులు జంపరంగి సునీల్‌కుమార్, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, లక్ష్మీపేట పంచాయతీ వార్డు సభ్యులు అల్లంగి కాశీప్రసాద్ జర్సింగి పద్మావతి, బాబూరావు, కాకరి గిరిబాబు, కొమ్మ ప్రసాదరావు, బత్తిరి మాణిక్యం, బి.చిరంజీవి పాల్గొన్నారు



పాడైన బోరును చూపుతున్న సల్దిమామిడి గిరిజన మహిళలు

గిరిజన విద్యా సమస్యలను పరిష్కరించాలి

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన విద్యాలయాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం పాడేరులో భారీ ర్యాలీ, అనంతరం ఐటిడిఎ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాజర్‌జీ, సహాయ కార్యదర్శి మస్తాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్. ఉపాధ్యక్షులు ఫణింద్ర మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, గిరిజన హాస్టళ్లలో హెల్త్ వాలంటీర్లను నియమించాలని, ఆశ్రమాల్లో విద్యార్థుల మరణాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, పాఠశాలలు, కాలేజీల్లో గిరిజన విద్యార్థుల ప్రవేశాలకు ఉన్న ఆటంకాలను తొలగించాలని, విద్యార్థులకు కాస్మోటిక్స్, ఇతర సౌకర్యాలను కల్పించాలని, మెనూ ప్రకారం ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో యూనియన్ జిల్లా అధ్యక్షులు వి. కృష్ణ, కార్యదర్శి ఎం. లక్ష్మణ్ జిల్లా నాయకులు పురిస్తాన్, తనీష్, అధిరామ్ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో సర్వే పూర్తిచేయాలి

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు, అన్ని రకాల వ్యాపార సంస్థల వివరాల సేకరణ సర్వేను రెండు రోజుల్లో పూర్తిచేసి నివేదించాలని ఎంపిడిఒ ఎవివి.కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్‌లో సచివాలయ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఆయా సర్వేలో మండలం వెనుకబాటులో ఉందన్నారు. ప్రభుత్వం, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కుటీర పరిశ్రమలు, వ్యాపార సంస్థల వివరాలను సేకరించి నివేదించాల్సి ఉన్నందున త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా సంస్థలకు ప్రభుత్వపరంగా రుణతోడ్పాటుకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు. సర్వేలో భాగంగా ఎన్‌పిసిఐ, మొబైల్ నెంబర్, బ్యాంకు అకౌంట్, ఆధార్ నెంబర్లలో అనుసంధాన ప్రక్రియను పూర్తయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.




సభ్యత్వ నమోదులో పాల్గొన్న టిడిపి మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- చింతపల్లి : మండలంలోనీ కొత్త పాలెం పంచాయితీ, కడశిల్ప గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ ఎక్కడికక్కడ టిడిపి సభ్యత్వ నమోదు చేపడుతున్నారని, దీనికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. రూ.వంద రుసుముతో సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి ప్రమాదబీమాతోపాటు పలు ప్రయోజనాలు ఉంటాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే లక్ష్యాలతో పార్టీలో సభ్యత్వాన్ని పొందేందుకు టిడిపి ప్రోత్సహిస్తోందని, ఆసక్తిఉన్నవారు సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.

ఎయును సందర్శించిన ఆస్ట్రేలియా వర్సిటీ విద్యార్థులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ నగరంలో ఉన్న విక్టోరియా యూనివర్సిటీ విద్యార్థులు సోమవారం సందర్శించారు. ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. విక్టోరియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మార్సిల్లె కాసియో టోలో, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ విభాగం డైరెక్టర్ డాక్టర్ గ్రెగ్ అరోన్సెన్, అన్నే మేరీల నేతృత్వంలోని విద్యార్థుల బృందం వీసీని కలిసి రెండు విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర సహకారం దిశగా చర్చించారు.



మాట్లాడుతున్న ఐద్వా నేత హైమావతి

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన మహిళా సంఘం డిమాండ్

ప్రజాశక్తి- పాడేరు : అల్లూరి జిల్లా పాడేరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏడవ తరగతి విద్యార్థిని, ఆదివాసీ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన అదే పాఠశాల ఇఎంఆర్ స్కూల్ ల్యాబ్ అసిస్టెంట్ అనూస్‌సింగ్ పటేల్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.హైమావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జీవన్‌కృష్ణ, కార్తీక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అనుస్‌సింగ్ పటేల్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగి, అదే పాఠశాల విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు. దీన్ని గోప్యంగా ఉంచిన ప్రిన్సిపల్ కూడా నేరస్తుడేనని, ఆయనపైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థిని కుటుంబ సభ్యులను ఐటిడిఎ అధికారులు పిఒ వాహనంలో తిప్పుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గతంలో బంధవీధి ఘటనలో తగు చర్యల్లో నిర్లక్ష్యం వల్లే ఇపుడు పాడేరులో అటువంటిదే మరో ఘటన పునరావృతమైందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బాలికల విద్యాలయాల్లో మహిళలనే నియమించాలని, పురుషులను నియమించాల్సి వస్తే 50ఏళ్లు పైబడిన వారిని నియమించాలన్నారు.

పథకాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ సమీక్షించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమం,, స్త్రీ శిశు సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పౌర సరఫరాలు, ఎస్ఎంఐ, సెరీకల్చర్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, నైపుణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్షించారు. ఈనెల 11, 12 తేదీలలో అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్ల సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించననున్న నేపథ్యంలో సంబంధిత పూర్తి వివరాల కోసం ముందుగా అధికారులతో సమీక్షించారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు సంక్షేమ పథకాల అమలు, రహదారులు, భవన నిర్మాణాలు, తాగునీటి పథకాలపై జిల్లా కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు చర్చిస్తారన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కె. వేణుగోపాల్, జి. డేవిడ్‌రాజు, ఆర్అండ్‌బి ఇఇ బాల సుందరబాబు, ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ జవహర్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, సెరీకల్చర్ ఎడి అప్పారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు, డిఎల్‌పిఒ పిఎస్.కుమార్ పాల్గొన్నారు.

ఇవిఎం గొడౌన్లను కలెక్టర్ తనిఖీ

స్థానిక డిగ్రీ కళాశాలలోని ఇవిఎం గొడౌన్లను జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ సోమవారం తనిఖీ చేసారు. అరకువ్యాలీ, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ నియోజక వర్గాలతోపాటు అరకు వ్యాలీ పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించిన ఇవిఎంలను భద్రపరిచిన గొడౌన్లకు సీలు వేసిన తాళాలను తెరచి, ఇవిఎంలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం గొడౌన్లను తనిఖీ చేయాల్సి ఉందని, ఈ మేరకు భద్రతా చర్యలపై పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె..పద్మలత, పాడేరు తాహశీల్దార్ వంజంగి త్రినాధరావు, డిటి, ఆర్ఐ, వైసిపి, బిజెపి, ఆమ్‌ఆద్మీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా ఈనెల 10న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎఇఇ ఎంవివిఎన్ అప్పారావు తెలిపారు. కొర్రాయి, కొల్లాపుట్టు, గసభ, సాగర, సొవ్వా, కించుమండ, కొర్ర, గుంటసీమ, గుంటగన్నేల, అరమ, దుంబ్రిగుడ, తుటంగి , కితలంగి పంచాయతీల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.



ఫెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేటి నుంచి యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎస్ఎఫ్ఐ ఆంధ్రా యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజులు పాటు యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్ జరుగనుందని, దీన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం యూనివర్సిటీ కమిటీ అధ్యక్షులు ఆర్.హర్షిత్, కార్యదర్శి డి.వెంకటరమణ కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం యూనివర్సిటీలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో ఫ్లాష్ మాబ్ నిర్వహించామన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఫెస్ట్‌లో పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు.

11న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ అధ్యక్షతన బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని విసి హాలులో, జెడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకుగల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని, సంబంధిత ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు 12 గంటలకు జరుగుతాయని వివరించారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు, అధికారులు సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

వినియోగదారులపై 'ఛార్జ్'

కూటమి ప్రభుత్వం దొంగ దెబ్బ

ఎఫ్‌పిపిసిఎల పేరిట విద్యుత్ బిల్లుల వడ్డన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

తాము అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచబోమని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం నేడు చాపకింద నీరులా భారాలు వేస్తోంది. నాడు జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానాలను చంద్రబాబు సర్కారూ అనుసరిస్తూ జనంపై విద్యుత్ బిల్లుల భారాన్ని మోపుతోంది. ఎఫ్‌పిపిసిఎల పేరిట వినియోగదారులకు షాక్ ఇస్తోంది. విశాఖ నగరంలో నవంబర్ నెలలో ఇళ్ల వద్ద లేని ప్రజలకు సైతం రూ.300 వరకూ బిల్లు రావడం విస్మయం గొలుపుతోంది. ఇటువంటి బిల్లులపై అభ్యంతరాలు కూడా వచ్చాయని ఒక అధికారి 'ప్రజాశక్తి'కి సోమవారం తెలిపారు. గతంలో వాడిన యూనిట్లపై తాజాగా భారాలు పడుతున్నాయని ఆయన అంగీకరించారు.

సామాన్యులకు తప్పని కష్టాలు

ఎఫ్‌పిపిసిఎ - 2 ఛార్జీల పేరిట నగర వాసులపై భారం పడుతోంది. కెఆర్ఎం కాలనీ ప్రాంతంలో సర్వీస్ నెంబర్ 112841హెచ్‌బి05054326కి సంబంధించి అక్టోబర్ నెల 151 యూనిట్లకు రూ.798 కరెంటు బిల్లు రాగా నవంబర్‌లో 87 యూనిట్లకు రూ.653 కరెంట్ బిల్లు వచ్చింది. అంటే అక్టోబర్ నెలలో సగటున యూనిట్‌కు రూ.5.28 బిల్లు పడింది. అదే నవంబర్ నెలకు వచ్చేసరికి యూనిట్‌కు 7.50 వచ్చింది. ఈ క్రమంలో ఒక్కొక్క యూనిట్‌కు రూ.2.22 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ వేసింది. ఈ విషయమై వినియోగదారుడు స్పందిస్తూ కూటమి నాయకులు ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి నేడు ఇలా భారాలు వేయడం అన్యాయమని అన్నారు.

విశాఖ డెయిరీలో సభా సంఘం పర్యటన

యాజమాన్యం అవినీతి, అక్రమాలపై ఆరా



విశాఖ డెయిరీ కార్యాలయంలో అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న సభా సంఘం సభ్యులు

ప్రజాశక్తి - గాజువాక, ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

విశాఖ డెయిరీపై ముసురుకున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ జరిపేందుకు శాసన సభా సంఘం సోమవారం డెయిరీలో విస్తృతంగా పర్యటించింది. సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ నేతృత్వాన కమిటీ సభ్యులు పల్లా శ్రీనివాసరావు, బొండా ఉమామహేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గౌతు శిరీష, ఆర్‌విఎస్‌కెకె.రంగారావు, దాట్ల సుబ్బరాజు డెయిరీలో కలియదిరిగి నిశితంగా అన్నింటినీ పరిశీలించారు. మూడు గంటల పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. ప్లాంట్‌లో ప్రాసెస్ యూనిట్‌ను తనిఖీ చేశారు. డెయిరీ అధికారులతో సమావేశమయ్యారు. పలు విషయాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పరిశీలన తరువాత తమకు మరిన్ని సందేహాలు పెరిగాయని తెలిపారు. భవిష్యత్తులో నిపుణుల కమిటీ వేసి సమగ్ర దర్యాప్తు జరుపుతామన్నారు. అనంతరం విశాఖ కలెక్టరేట్‌లో సభా సంఘం అధికారులతో సమావేశమైంది. పాల రైతు సంఘాల నాయకులు, పాడి రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించింది.

పాల రైతుల సంక్షేమాన్ని కాపాడాలని వినతి

డెయిరీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించి పాల రైతుల సంక్షేమాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ఆధ్వర్యాన జ్యోతుల నెహ్రూకు విశాఖ కలెక్టరేట్ వద్ద నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం నెల రోజుల క్రితం రైతులతోగానీ, పాల రైతుల సంఘం సభ్యులతోగానీ చర్చించకుండానే ఏకపక్షంగా ఆవు పాల ధరను తగ్గించేసిందన్నారు. దీనిపై రైతాంగం పెద్ద ఎత్తున గ్రామాల్లో నిరసనలు వ్యక్తం చేశారని తెలిపారు. డెయిరీ కార్యాలయం వద్ద అక్టోబర్ 29, డిసెంబర్ 2 తేదీల్లో రైతులు మహా ధర్నాలు చేపట్టారని గుర్తుచేశారు. ఈ క్రమంలో డెయిరీ అధికారులు దిగివచ్చి తగ్గించిన పాల ధరను పునరుద్ధరిస్తామని చెప్పినా ఆ దిశగా నేటికీ చర్యలు తీసుకోలేదన్నారు. డెయిరీలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న చర్యలను వివరించారు. సహకార రంగంలో ప్రారంభించిన డెయిరీని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా 37 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని రాంబాబు తదితరులు సభా సంఘానికి అందజేశారు. కార్యక్రమంలో పాల రైతుల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి జి.నాయనిబాబు, విజయనగరం జిల్లా అధ్యక్షులు లోకవరపు ఆదినారాయణమూర్తి, కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు రెడ్డి రమణమూర్తి, శ్రీకాకుళం జిల్లా నాయకులు యనమల రమణ, విజయనగరం జిల్లా నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు

డెయిరీ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టిండి : సిపిఎం

విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, పాడి రైతుల ఆస్తులను కాపాడాలని, తగ్గించిన పాల సేకరణ ధరను వెంటనే పునరుద్ధరించాలని, కంపెనీ యాక్టు నుంచి సొసైటీ యాక్టులోకి విశాఖ డెయిరీని తీసుకురావాలని కోరుతూ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూకు, కమిటీ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. పాడి రైతుల ఆస్తులను పరిరక్షించి, ప్రోత్సహించాల్సిన విశాఖ డెయిరీ పాలకవర్గం తమ సొంత ఆస్తులను కూడబెట్టుకోవడానికి అనేక తప్పుడు మార్గాలను ఎంచుకొని వివిధ రూపాల్లో అవినీతికి పాల్పడుతోందన్నారు. పాల ఉత్పత్తిదారులకు చెందిన ఆస్తులను కొద్ది మంది వ్యక్తులు తమ సొంతం చేసుకుంటున్నారని తెలిపారు. 2016లో రూ.1100 కోట్ల ఉన్న టర్నోవర్ 2020కి సుమారు రూ.2 వేల కోట్లు దాటిందన్నారు. ఇప్పుడు నష్టాలు, అప్పుల బాటలోకి డెయిరీ వెళ్లిందన్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. వాటిని సోదాహరణంగా కమిటీకి వివరించారు.

డెయిరీ కాలుష్యం నుంచి కాపాడాలి

గాజువాక : విశాఖ డెయిరీ నుంచి విడుదలవుతున్న జల, వాయు కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలని కోరుతూ శాసనసభా కమిటీ ఛైర్మన్ జ్యోతుల నెహ్రూకు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఎ.లోకేష్ సోమవారం వినతిపత్రం అందజేశారు. విశాఖ డెయిరీ వాయు కాలుష్యం వల్ల అక్కిరెడ్డిపాలెం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆరు లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నారని, వాటిని ప్రాసెస్ చేయడానికి 75 డిగ్రీల వద్ద మరిగిస్తున్నారని తెలిపారు. దీనికోసం బొగ్గు, ఆయిల్ బాయిలర్లను, భారీ మొత్తంలో కాస్టిక్ సోడా, సెప్టిక్ యాసిడ్ రకరకాల కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. వాడిన తర్వాత వచ్చే కెమికల్‌ను కాలవల ద్వారా విడిచిపెడుతున్నారని వివరించారు. దీంతో భరించలేని దుర్వాసన వస్తోందని తెలిపారు. భూగర్భ జలాలు కలుషితం కావడంతో కిడ్నీ, కేన్సర్, శ్వాస కోస వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకోవాలి

విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించిన మూడు ఎకరాల బంజరు భూమిని స్వాధీనం చేసుకోవాలని శాసనసభా కమిటీ సభ్యులు పల్లా శ్రీనివాసరావుకు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు ఎ.లోకేష్, ఎం.సుబ్బన్న సోమవారం వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబర్ 47/3లో మూడెకరాల బంజరు భూమిని విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించిందని తెలిపారు. చుట్టుపక్కల ప్రజలందరికీ ఇది సంత స్థలం అనిపేర్కొన్నారు. దీన్ని స్వాధీనం చేసుకుని ఆట స్థలం నిర్మించాలని కోరారు.



సభా సంఘం సభ్యుడు రంగారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



మహాధర్నాలో అభివాదం చేస్తున్న నాయకులు

ఎల్ఐసిని నిర్వీర్యం చేస్తే ఊరుకోం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎల్ఐసిలో ఐఆర్ డిఎఐ ద్వారా ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలంటూ సోమవారం ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన విశాఖపట్నం ఎల్ఐసి డివిజన్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించారు. సంఘం డివిజన్ అధ్యక్షులు ఎం.నాగరాజు అధ్యక్షతన అక్కడే సభ జరిపారు. ముఖ్య వక్తగా హాజరైన సంఘం ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో తీసుకొస్తున్న విధానాలను వివరించారు. ఆ విధానాల వల్ల 14 లక్షల మంది ఏజెంట్ల భవిష్యత్తు, ఎల్ఐసి సంస్థ నిర్వీర్యమవుతాయన్నారు. సంస్థను కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్రలు సాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా నవంబర్ 10 నుంచి డిసెంబర్ 10 వరకు అన్ని డివిజన్ల ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నాలు జరుగుతున్నాయన్నారు. ఎల్ఐసి ఏజెంట్స్ నుంచి కమీషన్‌ను రికవరీ చేసే క్లాబ్యాక్ నిబంధనను తొలగించాలన్నారు. తగ్గించిన ఏజెంట్ల కమీషన్‌ను పెంచాలన్నారు. కనిష్ట బీమా మొత్తం రూ.లక్షగా ఉండాలని, ఇన్సూరెన్స్ తీసుకునే వయస్సును 59 సంవత్సరాల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియంపై జిఎస్‌టిని రద్దు చేయాలని, పెంచిన ప్రీమియం తగ్గించాలని, పాలసీ హోల్డర్స్ బోనస్ పెంచాలని, అందరి ఏజెంట్స్‌కు మెడికల్ క్లెయిమ్ సౌకర్యం కల్పించాలని, గ్రాడ్యుటీ సీలింగ్ ఎత్తివేయాలని కోరారు. అందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్ ఏజెంట్ బతికి ఉన్నంతకాలం అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి 2025 ఫిబ్రవరి 11న లక్షలాది మందితో చలో పార్లమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. మహాధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కిషోర్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నాగరాజు, ఎన్.రవీంద్రనాథ్, ఠాగూర్, యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కె.త్రిమూర్తులు, కె.ఆంజనేయులు, అబ్దుల్ సత్తార్, ఎం.శ్రీరాములు, ధనుంజయ్, పి.శ్రీనివాసరావు, డిఎవి.నారాయణరావు, జి.రామారావు, ఎన్.రమణబాబు, ఎంసిహెచ్.ఈశ్వరరావు, వి.కావ్య, కె.మాధవి, పెద్ద సంఖ్యలో ఎల్ఐసి ఏజెంట్స్ పాల్గొన్నారు.

పావురాన్ని రక్షించిన విద్యుత్ కార్మికుడు

ప్రజాశక్తి-సీలేరు : ప్రమాదవస్తు విద్యుత్ లైన్‌లో చిక్కుకొని వేలాడుతున్న పావురాన్ని విద్యుత్ కాంట్రాక్టు లేబర్ కూర్మారావు రక్షించాడు. జీకే వీధి మండలం సీలేరు పురవీధుల్లో ప్రతిరోజు సుమారు 100 పావురాలు వరకు గుంపులు గుంపులుగా రోడ్లపై వాలి ఆహారాన్ని సేకరించుకుంటాయి. సోమవారం మార్కెట్లో సంచరిన్న పావురం కాలుకు దారాలు చుట్టుకున్నాయి. అది ఎగిరే సమయంలో కాలుకున్న దారాలు విద్యుత్ వైర్లు చుట్టుకొని చిక్కుకుంది. ఇది చూసిన వ్యాపారులు విద్యుత్ కార్మికుడు కూర్మారావుకి సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచివేసి పావురాన్ని కాపాడారు. ఈ దృశ్యాలు వాట్సాప్‌ల్లో హల్‌చల్ చేయడంతో పలువురు కూర్మారావును ప్రశంసించారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం : పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామని ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1397వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కార్మికుల సుదీర్ఘ పోరాటాన్ని కేంద్రంలోని మోడీ సర్కారు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల్లో గెలిచిన పాలకులు స్టీల్‌ప్లాంట్‌ను పట్టించుకోవడం మానేశారన్నారు.